
మోనోగ్రాఫ్ సిరీస్ - 3

బేతనభొట్ల నాగేశ్వరరావు



తెలంగాణ మీడియా అకాడమి

హైదరాబాద్

మీడియా అకాడమి ప్రచురణలు

1. తప్పులు దిద్దుకోండి
2. సుపరిపాలనకు పెద్ద దిక్కు సమాచార హక్కు
3. ప్రసార సాధనాలు పరస్పర ఆధారితాలు
4. తప్పులు - తిప్పలు
5. వార్త - రాత
6. నేర వార్తలు పదజాలం
7. వార్త కథనాలు
8. టి.వి. విలేకరి
9. టి.వి. డెస్క్ విజన్
10. విలేకరులు - పోలీసులు
11. పత్రికా పదకోశం
12. విలేకరి - చట్టాలు
13. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన జర్నలిస్టుల నైతిక ప్రవర్తన నియమావళి
14. ప్రభుత్వం - పత్రికలు
15. పత్రిక భాష
16. విలేకరి యోగ్యతలు - సత్యనిష్ఠ
17. గ్రామీణ విలేకరులు - వార్త వనరులు
18. విలేకరి - వ్యక్తిత్వ వికాసం
19. ఆంధ్రపత్రిక చరిత్ర
20. ఆంధ్రజాతి అక్షర సంపద - తెలుగు పత్రికలు
21. తప్పులు దిద్దుకుందాం
22. యాంకరింగ్ మరియు న్యూస్ రీడింగ్
23. కంప్యూటరే ఇక కలం, కాగితం
24. బడ్జెట్ - అవగాహన
25. సహపాఠి జాప్తాయ్ అఖ్లా ఖ్ (ఉర్దూ)
26. ఎలక్ట్రానిక్ మీడియా
27. స్వాతంత్ర్య పోరాటం జర్నలిస్టు యోధులు - జైలు శిక్షలు

బేతనబోట్ల నాగేశ్వరరావు



తెలంగాణ మీడియా అకాడమి
హైదరాబాద్

సేకరణ - రచన : బి.ఎస్.రామకృష్ణ

మొదటి ముద్రణ : నవంబర్, 2025

ప్రతులు : 3000

ప్రచురణ : తెలంగాణ మీడియా అకాడమి

ప్రతులకు : **తెలంగాణ మీడియా అకాడమి**
ఇ.నెం.5-9-166, చాపెల్ రోడ్, నాంపల్లి
హైదరాబాద్-500001.


Mail ID: mediaacademyoftelanganastate@gmail.com
Website: https://mediaacademy.telangana.gov.in

ముద్రణ:

నవచేతన విజ్ఞాన సమితి

12-1-493/VA, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్)
జిఎస్ఐ పోస్ట్, హైదరాబాద్-500068, తెలంగాణ.
ఫోన్: 040-29884450/53.
Website: www.navachethanabooks.in

ముందుమాట



తెలుగు జర్నలిజం, కొంతమేరకు ఉర్దూ జర్నలిజానికి సంబంధించి వృత్తిపరమైన జర్నలిస్టులకు, ఆసక్తి గల ఇతరులకు ఉపయోగపడే రీతిలో ఇప్పటి వరకు 1.పత్రికా పదకోశం (తొలి ప్రచురణ 1998 నుండి 2006 వరకు) మూడు ప్రచురణలను, 2.ఆంధ్రజాతి అక్షర సంపద - తెలుగు పత్రికలు (2004) 3.మీడియా వ్యాపారం నియంత్రణ రేఖ (2007)లపై గ్రంథాలను అకాడమి ప్రచురించింది. వాటితోపాటు 1996లో స్థాపితమైన ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ వృత్తిపరమైన జర్నలిస్టుల 2-3 రోజుల రిఫ్రెషర్ కోర్సులకు ఉపయోగపడే సబ్జెక్టుల వారి అనేక చిరు పుస్తకాలను ప్రచురించింది. అవి రాష్ట్ర జర్నలిస్టుల బహుళ ఆదరణ పొందాయి.

అలాగే, తెలంగాణ మీడియా అకాడమీ ఈ పర్యాయం అధికార భాష తెలుగు, ద్వితీయ భాష ఉర్దూకు సంబంధించిన తెలుగు, ఉర్దూ భాషల్లో పలువురు ప్రముఖ సంపాదకులు,

జర్నలిస్టుల జీవిత విశేషాలను వివరిస్తూ "మోనోగ్రాఫ్"ల పేరుతో చిరు పుస్తకాలను ప్రచురించ తలపెట్టింది. ఇందులో మొదటగా ఈ క్రింది ప్రముఖుల పుస్తకాలను వరుసగా ప్రచురిస్తున్నాం.

1. అబిద్ అలీఖాన్, 2. డి.సీతారాం, 3. బి.నాగేశ్వరరావు, 4. పొత్తూరి వెంకటేశ్వరరావు, 5. యం.యస్. ఆచార్య, 6. ఎ.బి.కె. ప్రసాద్, 7. జి.ఎన్.వరదాచారి, 8. సి.రాఘవాచారి, 9. వి.హనుమంతరావు, 10. ఆదిరాజు వెంకటేశ్వరరావు, 11. ఎం.ఎ.రహీమ్, 12. నసీం ఆరీఫి.

ఈ "మోనోగ్రాఫ్" చిరు పుస్తకాలు మన వృత్తిపరమైన జర్నలిస్టుల, వృత్తిపట్ల ఆకర్షితులైన యువతీ, యువకుల ఆదరణ పొందుతాయని విశ్వసిస్తూ...

కె. శ్రీనివాస్ రెడ్డి
చైర్మన్
తెలంగాణ మీడియా అకాడమి

తేదీ: 30.10.2025
హైదరాబాద్

బేతనబొట్ల నాగేశ్వరరావు

బాల్యం - కుటుంబం

జర్నలిజం అంటే మేధోమథనం, ఆ మథనంలో ప్రభవించిన దీపమే బేతనభొట్ల నాగేశ్వరరావు.

పుట్టిన ఊరు ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట... కానీ, జీవితం మొదలైంది తెలంగాణ గడ్డపై.

బి.నాగేశ్వరరావు 1928, నవంబర్ 18న కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో జన్మించారు. ఆ ఊరు ఆయన జన్మస్థలం మాత్రమే. అసలు బీఎన్ఆర్ అనే ఉద్యమయోధుడికి ఊపిరి పోసిన గడ్డ ఆంధ్రప్రదేశ్ అయితే.. అక్షర బీజాలు పండించిన నేల... తెలంగాణ నేల.

ఆయన తల్లిదండ్రులు దుర్గాంబ, లక్ష్మినారాయణ. తండ్రి నిజాం రైల్వేలో స్టేషన్ మాస్టర్. అధికార పద్ధతిలో నిబద్ధత ఉన్న వ్యక్తి. చిన్న వయస్సులోనే ఆయన కుటుంబం హైదరాబాద్ చేరుకుంది. నిజాం పాలన తీవ్రంగా ఉన్న రోజులు. ఆర్థికంగా సాధారణ మధ్యతరగతి కుటుంబం. బాల్యంలోనే ఇంట్లో నిత్యం రేడియోలో వార్తలు వినేవాడు. ఎక్కడైనా పత్రిక కనిపిస్తే చాలు.. ఆసాంతం

చదివేవాడు. ఇది ఆయనకు జ్ఞాపకశక్తిని, పరిశీలనా సామర్థ్యాన్ని, ప్రశ్నించే ధోరణిని పెంపొందించింది. భవిష్యత్తులో ఇదే ధోరణి ఆ బాలుడిని పాత్రికేయం వైపు నడిపించింది. తెలంగాణ పాఠశాలలు అప్పట్లో సాధారణంగా ఉర్దూ మీడియంలోనే ఎక్కువగా నడిచేవి. బీఎస్ఆర్ కూడా ఉర్దూ మీడియం పాఠశాలలో చదివారు. కానీ, ఆ తర్వాత తెలుగు, ఇంగ్లీషు భాషల్లోనూ ప్రత్యేక కోర్సులు చదివి మరీ త్రిభాషా జర్నలిస్టుగా ఎదిగారు. బాల్యంలో సైతం ఆయన విద్య తరగతి గదికే పరిమితం కాలేదు.



- స్వాతంత్ర్యం అంటే ఏంటి?
- నిజాం పాలన అంటే ఏంటి?
- గాంధీజీ ఎవరు?
- నెహ్రూ ఎందుకు ప్రసంగిస్తున్నారు? వంటి అంశాలను నెమరేసుకుంటూ తనకు వచ్చిన సందేహాలకు సమాధానాల కోసం అధ్యయనం చేసేవారు.

14 ఏళ్ల వయసులోనే మొదలైన పాత్రికేయ జీవితం

ఓ బాలుడు... సాయంత్రం స్కూల్‌కి వెళ్లొచ్చాక చుట్టూ తిరుగుతూ ఉద్యమాల గురించి, సభల గురించీ పుస్తకంలో రాసుకొని, వాటిని వార్తలుగా మలిచేవాడు. వాటిని ఉర్దూ పత్రికలకు, ఇంగ్లీష్ మ్యాగజైన్‌లకు వార్తలు పంపించడం ప్రారంభించారు. అలా మహాత్మా గాంధీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన సమయంలో ఆయన ప్రసంగాన్ని స్వయంగా విని, బీఎస్‌ఆర్ రాసిన వార్త ఒక ప్రముఖ దిన పత్రికలో ప్రచురితమైంది. ఆ రోజున ఆయన ఆనందానికి అవధులు లేవు. ఆ రోజు నుంచీ ఆయన చేతిలో కలం కేవలం వార్తలు రాయడం కోసమే కాదు, అప్పటి పోరాటాలకు ఓ ఆయుధం అయింది.

పదవ తరగతి చదువుతున్న సమయంలోనే స్వాతంత్ర్య ఉద్యమంలో, నైజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమాల ఫలితంగా పదోతరగతి మధ్యలోనే ఆగిపోయింది. కానీ,

అదే సమయంలో అంటే పద్నాలుగేళ్ల వయసులోనే జైలుకు వెళ్లారు. 20నెలల పాటు జైలు జీవితం గడిపారు. జైలు నుంచి తిరిగొచ్చాక తన చదువును కొనసాగించి ఎంఏ పూర్తి చేశారు.

గాంధీ - నెహ్రూ - గోరా ప్రభావం

నాగేశ్వరరావు బాల్యంలోనే మహాత్మాగాంధీ ప్రసంగాలను, నెహ్రూ నాయకత్వాన్ని, గో.రా. మానవతా భావనలను శ్రద్ధగా వినేవారు. వాళ్ల ప్రసంగాలు ఆయన జీవితానికి మార్గదర్శనం అయ్యాయి. చిన్న వయసులోనే దేశసేవ మార్గంలో పయనించేందుకు దారి చూపాయి.



ఆ తర్వాత రోజుల్లో గాంధీజీ సబర్మతీ ఆశ్రమంలో ఏడాది పాటు గడిపారు. బేతనభొట్ల నాగేశ్వరరావు – సరస్వతి దంపతులకు నలుగురు సంతానం. ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు.

ఉద్యమ ప్రస్థానం

బి.నాగేశ్వర రావు బాల్యం నుంచే.. అంటే విద్యార్థి దశనుంచే కేవలం విద్యార్థిగా కాకుండా ఓ విద్యావేత్తగా, ఉద్యమ కారుడిగా, ఓ యోధుడిగా మారిపోయారు. విశేషమైన దృఢ సంకల్పంతో, యుక్త వయసులోనే నిజాం పాలనకూ, బ్రిటిష్ వలస పాలనకూ వ్యతిరేకంగా నడిచిన తిరుగుబాటు మార్గం ఆయన జీవితానికి కేంద్రబిందువైంది. ఓవైపు చదువుకుంటూనే రహస్యంగా ఉద్యమాల్లో పాల్గొన్నారు.

ఓవైపు భారత స్వాతంత్ర్య పోరాటంలో, మరోవైపు నిజాం వ్యతిరేక హైదరాబాద్ విమోచన ఉద్యమంలో ఏకకాలంలో పాల్గొన్న ఉద్యమకారుడు బీఎన్ఆర్. తర్వాత కాలంలో ఆయనకు కార్మిక ఉద్యమాలతో, పౌరహక్కుల ఉద్యమాలతో కూడా సంబంధాలు ఏర్పడ్డాయి. సర్వోదయ ఉద్యమం పట్ల ఆకర్షితుడై ఆచార్య వినోబాబావే వెంట అనేక రాష్ట్రాల్లో భూదాన యాత్రల్లో కూడా ఆయన పాల్గొన్నారు. విజయవాడ పటమట కేంద్రంగా నాస్తిక కేంద్రం నిర్వహించిన నాస్తిక ఉద్యమ ప్రముఖులు గో.రా. గారు నాగేశ్వరరావుకు మంచి స్నేహితులు. తను నాస్తికుడు కాకపోయినా గో.రా.తో స్నేహం

కుదరడానికి ఉమ్మడి లక్షణం మానవత్వం.

గాంధీజీ తత్వాల పట్ల, ప్రసంగాల పట్ల బీఎస్ఆర్ ఎంతగానో ఆకర్షితుడయ్యాడు. అందుకే అహింసా మార్గంలోనూ, ప్రాథమిక హక్కుల కోసం ప్రజల పక్షాన నిలిచే ధైర్యమూ కలిగింది. ఆయన పత్రికలకు పంపే వార్తలు కేవలం సమాచారం అందించేవిగా మాత్రమే ఉండేవి కాదు. ఆవేదనా భరితంగా, శోధనా ఫలితంగా, అణచివేతకు ప్రత్యామ్నాయంగా ఉండేవి. ఆ సమయంలో ఆయన వయసు చిన్నది కావచ్చు, ఆయన విద్య చిన్న స్థాయిలో ఉండొచ్చు,



కానీ ఆయన ఆలోచనలు మాత్రం వయసును మించిన వేగంతో ఉద్యమాల వెంట పరుగులు పెట్టేవి. ఆయన ద్వారా ఎందరో యువజనులు ఉద్యమ పంథాను ఎంచుకున్నారు. పత్రికల్లో ఆయన రాసిన వార్తల ద్వారా ఎందరో ఉద్యమాలను సహానుభూతితో అర్థం చేసుకున్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న కారణంగా యుక్త వయసులోనే వరంగల్ జైలులో 20 నెలల పాటు కారాగారం అనుభవించారు. జైలులో గడిపిన రోజుల్లో, ఆయన కలం సునామిలా పనిచేసింది. తరువాత ఆయన రాసిన రాజకీయ విశ్లేషణలకు గల లోతూ, స్పష్టతా, సాహసమూ ఇవన్నీ ఆ అనుభవాలకు ప్రతిరూపాలుగా నిలిచాయి. ఒక సమర్థుడి చేతిలో కలం ఉంటే, అది బందూకు కంటే శక్తివంతంగా పనిచేస్తుంది. ఆ సమర్థుడే ఉద్యమకారుడు కూడా అయితే, ఆయన రాసే వార్తలు చరిత్రనే మలుపు తిప్పగలుగుతాయి. అలాంటి సమర్థుడు, ఉద్యమకారుడు బేతనబొట్ల నాగేశ్వరరావు అని జర్నలిస్టులు గర్వంగా చెప్పుకోవచ్చు.


జర్నలిజం - వృత్తి

"పదవులు మారతాయ్ పత్రికలూ మారతాయ్... కానీ నిజాన్ని చెప్పే కలం మారదు. ఆ కలం పట్టుకున్న వ్యక్తి మారడు." బి.నాగేశ్వర రావు జర్నలిజంలోకి వచ్చినప్పటినుంచి, ఆయన కలం ప్రజా వాణిగా

మారింది. ఆయన జర్నలిస్టుగా మారిన రోజు నుంచీ, విలువలు త్యజించని వ్యక్తిగా ఎదిగారు. వృత్తి అనే పదానికి ఆయన ఇచ్చిన నిర్వచనం "జీతం కోసం కాదు, జనం కోసం జర్నలిజం." అదే ఆయన నైజం.

పత్రికలకు వ్యాసాలతో శ్రీకారం

హైస్కూల్లో చదువుకుంటూ చుట్టుపక్కల జరుగుతున్న సంఘటనలను తన శైలిలో రాసి ఉర్దూ, ఇంగ్లీష్ పత్రికలకు పంపించడం ద్వారా నాగేశ్వరరావు గారి జర్నలిజం ప్రస్థానం ప్రారంభమయ్యింది. పంపిన వార్త ప్రచురించబడిన రోజు కలం



పట్ల సంతృప్తి కాదు, బాధ్యత మదిలో మెదిలింది. అక్కడినుంచి ఆయన జీవితంలోని ప్రతి వార్త ప్రజల కోసమే అయింది.

బాల జర్నలిస్టు

స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ పాత్రికేయుడు, జర్నలిజం అధ్యాపకులు, పబ్లిక్ రిలేషన్స్ నిపుణుడు, జర్నలిస్టు యూనియన్ జాతీయ నాయకుడు... అన్నిటికీ మించి సౌమ్యుడు, అందరితో స్నేహ పూర్వకంగా మెలిగి పాత్రికేయ రంగంలో ఎంతో మందికి మార్గదర్శిగా వెలుగొందిన బి.నాగేశ్వరరావు విద్యార్థి దశ నుంచే పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. పదవ తరగతి వరకు ఉర్దూ మీడియంలో చదువుకున్న నాగేశ్వరరావు.. సియాసత్, ది మున్సిఫ్ డెయిలీ ఉర్దూ పత్రికలకు వార్తా విశ్లేషణలు, వ్యాసాలను ఉర్దూలో రాసేవారు. అలాగే ఏఎన్ఎస్, ఎన్ఎస్ వార్తా సంస్థలకు వార్తలు ఇంగ్లీషులో పంపేవారు. ఉర్దూ మీడియంలో చదువుకున్నా మాతృభాషపై అభిమానంతో స్వయంగా నేర్చుకుని ఆంధ్ర భాషా నిలయం నిర్వహించే తెలుగు భాషా పరీక్షలు రాసి మాతృ భాషలో ప్రావీణ్యం సంపాదించడమే కాకుండా భారతి వంటి ప్రతిష్టాత్మక సాహితీ పత్రికకు వ్యాసాలు అందించారు.

బీఎన్ఆర్ గారి పాత్రికేయ జీవితం ఒక పట్టుదలతో కూడిన మార్గం. ఆ మార్గం ఇలా సాగింది :

గోల్కొండ పత్రిక

1940వ దశకంలోనే అంటే ఆయన ఇరవయ్యేళ్లలోపే పాత్రికేయ వృత్తిలో ప్రవేశించారు. తొలుత గోల్కొండ పత్రికలో చేరడం ద్వారా పాత్రికేయుడిగా ప్రస్థానం ప్రారంభించారు.

హైదరాబాద్ బులెటిన్

1950-51లోనే ఆయన 'హైదరాబాద్ బులెటిన్' పత్రికలో విలేకరిగా చేరారు. అసలు సిసలు జర్నలిజం అంటే ఏంటో ఆది నుంచే ఔపోసన పట్టారు. చివరిదాకా ఆ పంథాను కొనసాగించారు.



ప్రగతి వార పత్రిక

కొంతకాలం హైదరాబాద్ బులెటిన్‌లో పనిచేసిన తర్వాత బీఎన్నార్.. 'ప్రగతి' అనే వారపత్రికలో చేరారు. అప్పటిదాకా అందించిన రోజువారీ వార్తల స్థానంలో.. వారపత్రిక కోసం వార్తా కథనాల సమీక్షలు అందించారు.

ఆంధ్రపత్రిక

1960లలో ఆయన 'ఆంధ్రపత్రిక'కు హైదరాబాద్ రిపోర్టర్‌గా పనిచేశారు. ప్రతివారం "రాజధాని లేఖ" అనే ప్రత్యేక కాలమ్ రాసేవారు. అది రాజకీయ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. ఆ కాలం ప్రజాపాలనను సమర్థంగా విమర్శించిన తొలితరం జర్నలిజానికి ఉదాహరణ బీఎన్నార్.

గోల్కొండ పత్రిక - జమీన్ రైతు - భారతి

ఇవి మూడు వేర్వేరు రంగాలకు చెందిన వార్తలందించే పత్రికలు. పౌర హక్కులు, వ్యవసాయం, సాహిత్యం బి.ఎన్.ఆర్ ఒక్కరే మల్టీ-డొమైన్ జర్నలిస్టు. సాహిత్యం కూడా ఆయన కలానికి సిరాచుక్క అయ్యింది.

డెక్కన్ బులెటిన్

బి.నాగేశ్వరరావు కొంతకాలం డెక్కన్ బులెటిన్ పత్రికలో పనిచేశారు. ప్రస్తుతం టివోలి జంక్షన్ ఉన్న చోట డెక్కన్ బులెటిన్

కార్యాలయం ఉండేది.

INFA - ఢిల్లీకి రాజకీయ విశ్లేషణలు

ప్రముఖ పాత్రికేయులు, లోకసభ సభ్యులుగా పనిచేసిన ఇంద్రజీత్ నిర్వహించిన ఢిల్లీ నుండి వెలువడే Indian News Features Agency (INFA)కి బి.నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి న్యూస్ రౌండప్, పొలిటికల్ రౌండప్ పంపించేవారు. ఆ వార్తా కథనాలు తెలుగు వాళ్ల సమాచారం జాతీయ స్థాయిలో విస్తరించేందుకు ఒక దిశానిర్దేశకంగా పనిచేసింది. ఒక ప్రాంతీయ పాత్రికేయుడు జాతీయ స్థాయిలోనూ వార్తల్ని అందించగలడు అనే ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ భవిష్యత్తు తెలుగు జర్నలిస్టులకు ఆయన మార్గదర్శిగా మారారు.



డెక్కన్ క్రానికల్ - చీఫ్ రిపోర్టర్

డెక్కన్ క్రానికల్ పత్రికలో నాగేశ్వరరావు రెండు దశలుగా పని చేశారు. మొదట ఆ పత్రికలో చేరిన సమయంలో 'చీఫ్ రిపోర్టర్'గా పనిచేశారు. రెండోసారి అదే పత్రికలో 'డిప్యూటీ ఎడిటర్'గా చేరారు. పేరుకు డిప్యూటీ ఎడిటరే అయినా నిర్వహించిన బాధ్యతలు అన్నీపత్రిక 'సంపాదకులు'వే. యాజమాన్యం గానీ, పాలకవర్గంగానీ సంపాదక స్వేచ్ఛలో జోక్యం చేసుకుంటే బి.ఎన్.ఆర్. మొండిగా ఎదురు నిలిచేవారు. తోటి జర్నలిస్టుల పక్షం వహించేవారు. అయితే, ఇది కేవలం ధైర్యం కాదు, ఇది విలువల పట్ల ఆయనకు ఉన్న శ్రద్ధగా ఆనాటి జర్నలిస్టులు అభివర్ణించేవారు.

ఉస్మానియా యూనివర్సిటీ - పాత్రికేయుని నుండి బోధకునిగా పయనం

1968-69 సమయంలో ఎగిసిపడ్డ తెలంగాణ ఉద్యమం తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో పరిస్థితులను తిరిగి క్రమబద్ధీకరించే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళ రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే 1975లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా రిటైరైన జస్టిస్ పి.జగన్మోహన రెడ్డిని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమించారు. ఆ సమయంలో జస్టిస్ జగన్మోహన రెడ్డి ఏరికోరి ప్రత్యేకంగా బి.నాగేశ్వర

రావును ఉస్మానియా యూనివర్సిటీ పిఆర్‌ఓగా నియమించారు. అంతేకాదు జర్నలిజంలో ఆయనకున్న అపార అనుభవం, పాత్రికేయ వృత్తిలో రాజీపడని ఆయన వ్యక్తిత్వం గురించి అంతకుముందే తెలిసిన జస్టిస్ జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు పాఠాలు కూడా బోధించాలని చెప్పి బీఎస్‌ఆర్‌ను ఒప్పించి జర్నలిజం డిపార్ట్‌మెంట్‌లో బోధకుడిగా కూడా నియమించారు. అయితే, వీసీ ప్రతిపాదనను తిరస్కరించలేని పరిస్థితుల్లో బీఎస్‌ఆర్ తనకు తానే సంఘర్షణ ఎదుర్కొన్నారు. అసలు జర్నలిజంలో విద్యాపరమైన అర్హత (అకడమిక్ క్వాలిఫికేషన్) లేని తాను విద్యార్థులకు బోధన చేయడం అంటే తన మనసు అంగీకరించలేదు. జర్నలిజం కోర్సు బోధన మొదలు పెట్టక ముందే అదే యూనివర్సిటీలో జర్నలిజం కోర్సులో అడ్మిషన్ తీసుకున్నారు. ఆ అరుదైన విషయాన్ని అప్పటి ఓయూ జర్నలిజం విద్యార్థులు ఇప్పటికీ స్మరించుకుంటారు. తరగతి గదిలో ఆయన పాఠం చెబుతున్నప్పుడే విద్యార్థిగా, బోధకుడిగా రెండు పార్శ్వాలను అనుభవించేవారు. తరగతి గదినుంచి బయటకు వచ్చిన తర్వాత 'ప్రజా సంబంధాల అధికారి' పాత్రను పోషించేవారు. ఇలా ఏక కాలంలో ఒక విద్యార్థిగా, బోధకుడిగా, ప్రజా సంబంధాల అధికారిగా మూడు రకాల పాత్రలను సమర్థవంతంగా నిర్వర్తించారు.

ఆయన తరగతి గదిలో కలం ఎలా పట్టాలి, వార్త ఎలా రాయాలి,

సత్యాన్ని ఎలా నిలబెట్టాలి అనే అంశాలు నేర్పేవారు. ఫలితంగా ఆయన బోధనలు విన్న ప్రతి విద్యార్థి కలం చేతబట్టి పోరాటం చేసే విలువలు నేర్చుకున్నాడు. బీసీజే విద్యార్థులకు జర్నలిజం పాఠాలు బోధిస్తున్న క్రమంలో పుస్తకంలో ఉండే పాఠ్యాంశాన్ని వివరిస్తూనే వార్తల సేకరణ, రూపకల్పన, ఎడిటింగ్, ప్రూఫ్ రీడింగ్ వంటి తన జర్నలిజం అనుభవాలను స్వయంగా ప్రాక్టికల్‌గా వివరించేవారు. జర్నలిస్టుగా తాను సంపాదించుకున్న విజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించేవారు. ఆసక్తికరంగా, అందరినీ ఆకట్టుకునే విధంగా పాఠాలు చెప్పేవారు. అంతేకాదు ఆ సమయంలో హైదరాబాద్‌లో ఉన్న పీటీఐ కార్యాలయానికి జర్నలిజం విద్యార్థులను తీసుకు వెళ్లి వార్తలు ఎలా సేకరిస్తారు? అవి ఆ కార్యాలయానికి ఎలా వస్తాయి? రిపోర్టర్లు పంపించిన వార్తలను ఆఫీసులో ఎలా ఎడిట్ చేస్తారు? ప్రచురణ కోసం కాపీలను ఎలా రూపొందిస్తారు? వంటి అంశాలన్నింటినీ ప్రాక్టికల్‌గా చూపిస్తూ వివరించేవారు. ఈ తరహా బోధన భావి జర్నలిస్టులకు చాలా ఉపయోగపడిందని తర్వాత జర్నలిస్టులుగా ఎదిగిన వాళ్లు చెప్పుకుంటారు.

ఒక జర్నలిస్టుగా, జర్నలిజం విద్యార్థులను తన భావి సహచరులుగా భావించేవారు బీఎన్నార్. తాను ఒక లెక్చరర్‌ను అని, అప్పటికే తల పండిన జర్నలిస్టునని, అన్నింటికీ మించి ఓయూ

వీసీకి సన్నిహితంగా మెలిగే పీఆర్ఓనన్న గర్వంగానీ, అహంగానీ ఆయనలో మచ్చుకైనా కనిపించేది కాదు. అందుకే సమయం దొరికినప్పుడల్లా జర్నలిజం స్టూడెంట్స్ ఉండే ఓల్డ్ పీజీ హాస్టల్‌కు వెళ్లేవారు. విద్యార్థులతో కలిసి యూనివర్సిటీ మెస్‌లో అప్పుడప్పుడూ భోజనం చేసేవారు. అయితే, అక్కడ కేవలం పెరుగన్నం మాత్రమే తినేవారట. ఉస్మానియా యూనివర్సిటీ 1976-77 బ్యాచ్ బీసీజే విద్యార్థులు ఇప్పటికీ ఆ జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఉంటారు.

డెక్కన్ క్రానికల్ - డిప్యూటీ ఎడిటర్

రెండున్నర సంవత్సరాల పాటు ఉస్మానియా యూనివర్సిటీలో పీఆర్ఓగా, జర్నలిజం విద్యార్థులకు అధ్యాపకుడిగా సేవలు అందించిన నాగేశ్వర రావు తిరిగి డెక్కన్ క్రానికల్ దినపత్రికలో చేరారు. యాజమాన్యం పిలుపు మేరకు ఈ సారి 'డిప్యూటీ ఎడిటర్'గా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగం 'డిప్యూటీ ఎడిటర్'గానే అయినా, 'ఎడిటర్' బాధ్యతలను చూసుకునేవారు బీఎన్నార్.

అయితే, రెండో సారి కూడా బీఎన్ఆర్ డెక్కన్ క్రానికల్‌లో ఎక్కువ కాలం పనిచేయలేదు. సంపాదక స్వేచ్ఛకు ఎదురైన ఒత్తిడులను తట్టుకోలేక తన పదవికి రాజీనామా చేశారు. ఆయన దృష్టిలో సంస్థ, సంపాదక స్థానం కన్నా పత్రికా ధర్మం గొప్పది. జర్నలిజం విలువలు గొప్పవి.

ఏకకాలంలో మూడు భాషల్లో వార్తా రచన

డెక్కన్ క్రానికల్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన పలు స్థానిక, జాతీయ స్థాయి పత్రికలకు, న్యూస్ ఏజన్సీలకు వార్తలు, వ్యాసాలు, విశ్లేషణలు రాసేవారు. బీఎన్నార్‌కు ఉర్దూ, తెలుగు మరియు ఇంగ్లీష్ జర్నలిజంలో ప్రావీణ్యం ఉండడంతో ఒకే వార్తను ఈ మూడు భాషలలోనూ రాసి ఆయా భాషల పత్రికలకు పంపేవారు. అందుకే బీఎన్ఆర్ అరుదైన జర్నలిస్టు.

అనేక పత్రికలు, చిన్న దినపత్రికలు ఊపిరిపోసుకోవడానికి ఆయన వార్తలు, వ్యాసాలు, విశ్లేషణలు, సంపాదకీయాలను అందించడం ద్వారా సహాయం చేసి ప్రోత్సహించారు. కొంతకాలం ఆయన జీతం ఆశించకుండా చిన్న వార్తా సంస్థలు, వార్తల ఏజెన్సీలు, పత్రికలకు తన వృత్తిపరమైన సేవలను అందించారు. ప్రధానంగా చిన్నపత్రికలు, ఉర్దూ పత్రికలకు వార్తలను పంపేందుకు పనిచేసే న్యూస్ ఏజన్సీలను నాగేశ్వరరావు ప్రోత్సహించారు. చాలా కాలం సీనియర్ పాత్రికేయులు రజాలీ నిర్వహించిన ఏఎన్ఎస్ న్యూస్ ఏజన్సీకి నాగేశ్వరరావు రెగ్యులర్‌గా వార్తలు పంపించేవారు.

చిన్న పత్రికల కలల పునాది

1980లో ఆయన News and Services Syndicate (NSS)కు ప్రధాన సంపాదకుడిగా బాధ్యతలు చేపట్టారు.

ఎన్‌ఎస్‌ఎస్‌కు ఆయన ఫౌండర్ ఎడిటర్. ఈ కార్యాలయం బషీర్‌బాగ్‌లోని రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యాలయం దేశోద్ధారక భవన్‌లో కొనసాగేది. దీనిని జర్నలిస్ట్, మాజీ శాసన సభ్యులు కొండ లక్ష్మారెడ్డి స్థాపించారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆ కాలంలోనే చిన్న పత్రికలకు వార్తలు పంపేది, యువ పాత్రికేయులకు శిక్షణ ఇచ్చేది.

అలా.. బీఎన్నార్ ఈ సంస్థను ఓ గురుకులంగా మార్చారు. ఆయన దగ్గర పనిచేసిన అనేకమంది ఈరోజు ప్రముఖ జర్నలిస్టులుగా పనిచేస్తున్నారు.



డైలీ న్యూస్, నవ్యాంధ్ర, ఇండియన్ హెరాల్డ్

'డైలీ న్యూస్', 'నవ్యాంధ్ర', 'ఇండియన్ హెరాల్డ్' వంటి పత్రికలకు బీఎస్నార్ సంపాదకులుగా వ్యవహరించారు. డైలీ న్యూస్ ఆంగ్ల పత్రికను మాజీమంత్రి వి.బి.రాజు నుండి శాసనమండలి మాజీ ఉపాధ్యక్షులు, మాజీమంత్రి కె.కేశవరావు నిర్వహించారు.

CALAMUS

పరిశ్రమలు, ఆర్థిక రంగం, పెట్టుబడి మార్గాలకు సంబంధించిన వార్తలు అందించే పత్రికలు లేని కాలంలోనే ఆయన ఓ బిజినెస్ మ్యాగజైన్‌కు శ్రీకారం చుట్టారు. స్వయంగా బీఎస్నార్ గారే CALAMUS పేరిట Industrial Monitor weeklyని సొంతంగా నిర్వహించారు.

టార్చ్ బేరర్స్ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్ ఇన్ ఆంధ్రప్రదేశ్

బీఎస్నార్ జర్నలిస్టుగా పత్రికారంగానికి విశేష సేవ చేయడమే కాదు, 'టార్చ్ బేరర్స్ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే గ్రంథాన్ని కూడా రచించారు.

కలం అంటే ఆయుధం కాదు, ఆత్మ!

ఆయన రాసిన దారిలో ఎందరో వార్తలపై నమ్మకం, సత్యంపై విశ్వాసం, వృత్తిపై గౌరవం పెంచుకున్నారు. ఆయన ఎడిటర్‌గా పని చేసిన పత్రికలు మారినా, పని చేసిన పాత్రికేయ స్థానం మారినా

ఆయన నమ్మిన విలువలు మారలేదు. ఆయన రాసే వార్తల శైలీ మారలేదు.

ఏకసంతాగ్రహిగా పేరున్న బీఎన్నార్ రిపోర్టింగ్‌కి వెళ్లినపుడు నోట్స్ ఏమీ రాసుకోకపోయినా ఫ్యాక్ట్స్ అండ్ ఫిగర్స్‌తో వాస్తవాలు పొల్లుపోకుండా వార్తలు, వార్తా కథనాలు రాసేవారు. అలాగే నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివరాలు ఆయనకు కొట్టిన పిండి. ప్రాజెక్టు వివరాలు, గణాంకాలు, నిర్మాణ వ్యయం, శంకుస్థాపన తేదీ నుంచి ప్రారంభోత్సవం వరకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివరాలు ఎప్పుడు అడిగినా అనర్గళంగా చెప్పేవారట.

ఢిల్లీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ మాస్ మీడియా నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానంపై ఎన్నో సందర్భాలలో ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల శిక్షణ తరగతులలో పాఠాలు చెప్పేవారు. బీఎన్నార్ ఏ సంస్థలో, ఏ స్థాయిలో పనిచేసినా "పత్రికా స్వేచ్ఛ"కు బలమైన అండగా నిలిచేవారు. సంపాదకీయ విషయాలలో యాజమాన్యాల నిర్వహణ జోక్యాన్ని పూర్తిగా వ్యతిరేకించేవారు. ఈ వైఖరి వలన ఆయన ఏ సంస్థలోనూ ఎక్కువ కాలం కొనసాగలేకపోయారు.

వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమంలో పాత్ర

జర్నలిస్టుల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పాటుపడ్డారు. దానికి వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ వాహకంగా మారింది.

వర్కింగ్ జర్నలిస్టుల సంఘంలో దశాబ్దాల పాటు కీలకంగా పనిచేశారు. జర్నలిజం అంటే కేవలం వార్తలు రాయడం కాదు. ఆ వార్తలు రాసే వారికీ, వారు పని చేసే వాతావరణానికీ న్యాయం కలిగించాలన్న లక్ష్యం కూడా పాత్రికేయ జీవితంలోని భాగమే. బి. నాగేశ్వర రావు ఈ విషయాన్ని తొలి నాటి నుంచే అనుసరించారు.

ఏపీయూడబ్ల్యూజే - ఒక యూనియన్, ఒక ఉద్యమం

వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన నాగేశ్వర రావు అప్పటి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (APUWJ) వ్యవస్థాపకులలో ఒకరు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జర్నలిస్టులకు రక్షణ లేదు, కనీస వేతనం లేదు, ఉద్యోగ భద్రత లేదు, వారిలో సంఘటిత శక్తీ లేదు. అలాంటి క్లిష్టమైన సమయంలో బీఎన్ఆర్ వంటి నాయకులు తెలంగాణ-ఆంధ్ర సంఘాలను సంఘటితపరిచి యూనియన్ స్థాపించడంలో కీలక పాత్ర పోషించారు.

యూనియన్ ఆవిర్భావ సభ

అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యూనియన్ ఏర్పాటైన సమయంలో హైదరాబాద్ జూబ్లీ హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర యూనియన్ ఆవిర్భావ సభకు ప్రఖ్యాత జర్నలిస్ట్ నేషనల్ హెరాల్డ్

సంపాదకులు మానికొండ చలపతిరావు హాజరయ్యారు. బీఎన్నార్.. యూనియన్ తొలి కార్యవర్గంలో కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇక ఆయన పాత్ర.. 'ఉద్యమ కార్మికుడి' పాత్ర కాదు 'నాయకుడి' పాత్రగా టర్న్ తీసుకుంది.

యూనియన్ నడిపించిన యోధుడు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (APUWJ) అధ్యక్షులుగా బీఎన్నార్ అనేక మార్లు ఎన్నికయ్యారు. తొలుత 1964-65, 1965-66 సంవత్సరాలకు వరుసగా రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా, ఆ తరువాత సంవత్సరం 1966-67లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత వరుసగా మూడు



పర్యాయాలు (1970-71, 1971-72, 1972-73) యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. మళ్లీ రెండేళ్ల కాలపరిమితికి (1974-76) అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

మరో విశేషం ఏటంటే 1983లో యూనియన్ నిబంధనావళిలో చేసుకున్న సవరణల ప్రకారం నేరుగా సాధారణ సభ్యుల ఓట్లతోనే రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకునే విధానం అమలులోకి వచ్చింది. ఈ సవరణ అమలులోకి వచ్చిన అనంతరం నిర్వహించిన తొలి ఎన్నికలలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆ తరువాత యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులుగానూ ఎన్నికయ్యారు.

హైదరాబాద్ ప్రెస్ క్లబ్, ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ హైదరాబాద్ జర్నలిస్ట్ త్రిఫ్ట సొసైటి వంటి అనుబంధ సంస్థల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. పత్రిక ఉద్యోగుల కోసం ఆయా ప్రభుత్వాలతో వేజ్‌బోర్డుల కోసం పోరాటాలు చేశారు. అధికారులను ఒప్పించడంలోనూ, రాష్ట్ర ప్రభుత్వాలను అంగీకరించేలా చేసుకోవడంలోనూ బీఎస్నార్ అనుభవం, వ్యూహం, ధైర్యం ముఖ్యపాత్ర పోషించాయి.

దేశోద్ధారక భవన్ - యూనియన్ కార్యాలయం

బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్. ఈ భవనం ఒక సాధారణ

కార్యాలయం కాదు.. జర్నలిస్టుల కలలకు కేంద్రబిందువు. యూనియన్ కార్యకలాపాలల్లో చురుగ్గా పాల్గొన్న నాగేశ్వర రావు దేశోద్ధారక భవన్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. యూనియన్ కార్యాలయం నిర్మాణానికి సినీ ప్రముఖులతోనూ కార్యక్రమాలు నిర్వహించి రాజకీయ నాయకులతోనూ చర్చించి, వాళ్లను ఒప్పించి నిధులు సేకరించారు.

ఎం.సి.స్మారక లైబ్రరీ ఏర్పాటులో బిఎన్నార్ కృషి

బషీర్‌బాగ్ యూనియన్ ఆఫీసులోని ఎం.చలపతి రావు (ఎం.సి.) స్మారక గ్రంథాలయం ఏర్పాటుకు ఆయన సూచనలే ప్రేరణగా నిలిచాయి. ఏపియూడబ్ల్యూజె అనుబంధ హైదరాబాద్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (హెచ్‌యుజె) కృషి ఫలితంగా జర్నలిస్టుల కోసం రాష్ట్ర యూనియన్ కేంద్ర కార్యాలయ భవనం దేశోద్ధారక భవన్‌లో 1986లో అలా మంచి రిఫరెన్స్ లైబ్రరీ ఏర్పాటయ్యింది.

బిఎన్నార్‌కు గుర్తింపు
జర్నలిస్టుల సంక్షేమానికి అవార్డు

1993లో APUWJ విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం "బి.నాగేశ్వర రావు ఉత్తమ పాత్రికేయ అవార్డు"ని ప్రారంభించింది. ఆ అవార్డు కింద రూ.10,000 నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందిస్తారు.

రెండో యేడాది నుంచి అవార్డు కింద అందించే నగదు మొత్తాన్ని రూ.25,000కి పెంచారు. 1994లో తొలి "బి.నాగేశ్వరరావు ఉత్తమ పాత్రికేయ అవార్డు" సీనియర్ జర్నలిస్టు జి.కృష్ణ గారికి అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఇది ఒక అవార్డు కాదు. ఇది బీఎన్ఆర్ కలానికి గౌరవం, ఆయన ఉద్యమానికి గుర్తింపుగా అభివర్ణించడం అతిశయోక్తి అసలే కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతియేడాదీ ఆయన పేరిట జర్నలిజంలో సమున్నత సేవలందించిన వాళ్లను ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేశారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి చకోస్లొవేకియా వరకు అంతర్జాతీయ ప్రాతినిధ్యం

బీఎన్ఆర్ జర్నలిస్టు యూనియన్ ప్రతినిధిగా విదేశీ పర్యటనలు కూడా చేశారు. ఆయన చకోస్లొవేకియాలో జర్నలిస్టుల సమావేశంలో 'భారత పత్రికల స్వేచ్ఛ', 'ఉద్యోగ భద్రత' వంటి అంశాలపై ప్రసంగించారు.

బి.నాగేశ్వరరావు - కలం కర్మయోగి

'ఆయన కన్ను మూశారు కానీ... కలం ఆగలేదు. ఆయన శ్వాస ఆగింది కానీ... సందేశం చిరస్థాయిగా నిలిచిపోయింది.'ఈ పుస్తకాన్ని చదవడం ప్రారంభించినప్పుడు.. ఒక పాత్రికేయుని జీవితం గురించి

చదువుతున్నామన్న ఆలోచనలో ఉంటారు.. కానీ, పుస్తకం ఆఖరి పుటకి చేరగానే మీరు గ్రహించేది ఏంటంటే.. 'బి.నాగేశ్వరరావు పాత్రికేయుడు మాత్రమే కాదు... ఓ ఉద్యమ స్ఫూర్తి, ఓ మానవతా యోగి, ఓ విప్లవ శక్తి'.

పరిమిత వనరులతో అపరిమిత ప్రభావం

బీఎన్నార్ కలం...

- సామాన్యుల కోసం రాసింది
- ప్రభుత్వాలను ప్రశ్నించింది
- ప్రజాస్వామ్యానికి తలమానికంగా నిలిచింది



ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొని, నైజాం వ్యతిరేక ఉద్యమంలో భాగమై ఎన్నో అనుభవాల నుంచి శక్తిని సంపాదించి, చివరకు సమర్థమైన, సత్యాన్ని శోధించిన, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాల్సిన జర్నలిజానికి ఓ వెలుగయ్యారు.

బిఎన్నార్ 1991 ఫిబ్రవరి 4వ తేదీన కాలం చేశారు. అనారోగ్యంతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. కానీ ఆయన ప్రభావం పత్రికా రంగంలో చెరగని ముద్ర వేసింది.

బి.ఎన్.ఆర్. గారికి అప్పటి రాజకీయ నేతలలో ఉన్న గౌరవానికి ఓ ఉదాహరణ. వారు ఇకలేరు అని తెలిసిన తర్వాత అప్పటి ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు గారు తన తదుపరి హైదరాబాద్ పర్యటనలో బంజారాహిల్స్ జర్నలిస్టు కాలనీలోని నాగేశ్వరరావు గారి ఇంటికి ప్రత్యేకంగా వచ్చి శ్రీమతి నాగేశ్వరరావుగారిని పరామర్శించారు. పివి వెంట బిఎన్ ఆర్ ఇంటికి పరామర్శకు వచ్చిన వారిలో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి కూడా ఉన్నారు.

Moving Encyclopedia

నడిచే గ్రంథం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో ఆయన లెక్చర్లు విన్న విద్యార్థులు ఆయనను 'Moving Encyclopedia' (నడిచే గ్రంథం) అని గర్వంగా చెప్పుకుంటారు. ఎందుకంటే ఆయన దగ్గర ఉన్నది సాధారణ జ్ఞానం కాదు – పరిణతి చెందిన లోక జ్ఞానం. ఆయన దగ్గర ఉన్నవి పదాలు కాదు – ఈటెలుగా దూసుకెళ్లే కలం విత్తనాలు.

ఈ పుస్తకం చివరగా ఒక చివరి పుట మీద ఆగినా బి.నాగేశ్వర రావు గారి జీవితం ఇంకా చెప్పాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. ఇది కేవలం ఒక జీవిత కథ కాదు. ఇది ఒక ఆదర్శగాథ. జీవితాంతం కలాన్ని వదలకుండా ప్రజల పక్షాన, జర్నలిస్టుల పక్షాన నిలిచి, విలువలకే నిలిపిన ఆదర్శ పాత్రికేయుని కథ ఇది. బి.నాగేశ్వర రావు విద్యార్థిగా, యోధుడిగా, పాత్రికేయునిగా, బోధకుడిగా, సంఘ సంస్కర్తగా ఆయన సేవలు అజరామరం.







